18వ
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
గురువారం,20 మార్చి 2025 | 8 పేజీలు

## మంత్రి నారా లోకేష్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్



**పెదపాడు,మేజర్‌న్యూస్:** కృష్ణాజిల్లాపర్యటనలో భాగంగా హనుమాన్ జంక్షన్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయానికి విచ్చేసిన రాష్ట్ర మానవ మానవుల అభివృద్ధి ఐటి ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ శాఖల మంత్రి నారా లోకేష్‌ని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రీ సెల్వి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.



## రాష్ట్ర పురోగతికి గేట్స్ ఫౌండేషన్
# ఒప్పందాలు దోహదం

**– కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ**



**ఢిల్లీ/భీమవరం,మేజర్‌న్యూస్ :** గేట్స్ ఫౌండేషన్‌తో ఏపీ ప్రభుత్వం చేసుకున్న కీలకఒప్పందాలు రాష్ట్రపురోగతికి ఎంతగానో దోహదపడతా యని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఢిల్లీలో బుధవారం మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, ఐటీదిగ్గజం బిల్ గేట్స్‌తో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరిగిన సమావేశంలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పాల్గొన్నారు. బిల్ గేట్స్ ఫౌండేషన్, ఏపీ ప్రభుత్వం మధ్య ఆరోగ్యం, విద్య, వ్యవసాయం,ఉద్యోగ ఉపాధి కల్పన తదితర కీలక రంగాల్లో సేవలను మెరుగు పర్చడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ప్రెడిక్టివ్ ఎనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతల వినియోగానికి ఉన్న అవకాశాలపైన కీలక చర్చలు జరిగాయని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మఅన్నారు. ఆంధ్రప్రదేశ్ పురోగతికి మద్దతుగా బిల్ గేట్స్ ముందుకు వచ్చినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.

## విద్యా శాఖ మంత్రి లోకేష్‌కు
# స్వాగతం పలికిన మంత్రి పార్థసారధి





**నూజివీడు,మేజర్‌న్యూస్ :** గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామంలోగల పారిశ్రామిక కేంద్రంలో నిర్మించిన అశోక్ లైలాండ్ కంపెనీ ప్రారంభోత్సవ కార్యక్రమానికివిచ్చేసిన, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యా శాఖ,ఐ.టి. శాఖామంత్రి, నారా లోకేష్‌కు రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఘనస్వాగతం పలికారు. నూజివీడు నియోజకవర్గంలోని నూజివీడుమండలం, మర్రిబంధం,సీతారాంపురంపోలవరం కాలువ వారధి కూడలిలోవిశేష జనాభాతో,పార్టీకార్యకర్తలు, నాయకులతో, భారీగజమాలతో మంత్రి పార్థసారధి స్వాగతం పలికారు. కార్యక్రమంలోనూజివీడు నియోజకవర్గ, తెలుగుదేశం,జనసేన ,బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు,పెద్ద ఎత్తున పాల్గొని నారా లోకేష్‌పూలదండలతో,పుష్పగుచ్చాలతో సత్కరించారు.

## శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో
# మంత్రి లోకేష్ పూజలు





**– ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**

**పెదపాడు,మేజర్‌న్యూస్ :** తొలిసారిగా దెందులూరు నియోజకవర్గంలో పర్యటించిన రాష్ట్ర విద్య ,ఐటీ శాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదరి నారా లోకేష్‌కి అప్పన్న వీడులోని హనుమాన్ జంక్షన్ శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం వద్ద నియోజక వర్గకూటమినాయకులతో కలిసి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఘనస్వాగతంపలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో మంత్రి నారా లోకేష్ ,మంత్రి కొల్లు రవీంద్ర, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తో కలిసి చింతమనేని ప్రభాకర్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి ,జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ సహా పలువురు నాయకులు ప్రభుత్వ శాఖల అధికారులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## బీసీ వర్గాల నుండి స్వయం ఉపాధి పథకాలకు
# దరఖాస్తులు ఆహ్వానం



**భీమవరం,మేజర్‌న్యూస్ :**వెనుకబడిన తరగతుల వర్గాల నుండి స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.వెనుకబడిన తరగతులకు చెందిన బిసి-ఎ, బిసి-బి, బిసి-డి,బిసి-ఇ, ఈడబ్ల్యూఎస్ వర్గాల వారికి స్వయం ఉపాధి పథకాలు, జనరిక్ ఫార్మసీలు, ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటుకు సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న అర్హులైన లబ్ధిదారులు https://apobmms.apcfss.in ద్వారా ఆన్లైన్లో మార్చి 22వ తేదీ లోపుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బిసి-ఎ,బిసి-బి,బిసి-డి,బిసి-ఇ&ఇడబ్ల్యూఎస్ వర్గాలు ఆర్యవైశ్య, రెడ్డి, కమ్మ, బ్రామ్మిన్, ఇడబ్ల్యూఎస్ వర్గాల వారికి కూడా స్వయం ఉపాధి,జనరిక్ ఫార్మశీల కొరకు బి-ఫార్మశీల లేక డి-ఫార్మశీ చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు, స్వయం ఉపాధి పథకాలను మేదర, కుమ్మరి శాలివాహన వారికి వృత్తి పరముగా బుట్టల అల్లకము, కుండల తయారీ చేసుకుంటున్న వారి నిమిత్తము పథకముల క్రింద నిర్దేశించిన లక్ష్యముల మేరకు బ్యాంకులోన్,ప్రభుత్వ సబ్సిడీతో ఆర్థిక సహాయము మంజూరు చేయుటకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.స్వయం ఉపాధి పథకము నందు ఆర్థిక సహాయము

- తరువాయి 2లో..

# విదేశీ ఉత్పత్తుల దిగుమతులను తగ్గించడానికి కేంద్రం చర్యలు

**ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చిన కేంద్ర మంత్రి**



**ఢిల్లీ/ ఏలూరు,సూర్య బ్యూరో :** భారతదేశంలోని ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, టెలికాం, పవర్ వంటి వేగంగా విస్తరిస్తున్న రంగాల డిమాండ్‌ను తీర్చడానికి దిగుమతలపై ఆధారపడడం జరుగుతోందని, దేశీయ సరఫరాను పెంచి దిగుమతులను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని, 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంతో పాటు 14 కీలక రంగాలలో ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకాల ద్వారా ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, వైట్ గూడ్స్, టెలికాం నెట్‌వర్కింగ్ ఉత్పత్తులు వంటివి ఉన్నాయని కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ వెల్లడించారు.చైనాలో తయారైన ఉత్పత్తుల దిగుమతిని తగ్గించేందుకు ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టిందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బుధవారం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. సెమికండక్టర్, డిస్ప్లే తయారీ ఎకోసిస్టమ్ అభివృద్ధి కోసం రూ. 76 వేల కోట్లు వ్యయంతో సెమికాన్ ఇండియా ప్రోగ్రామ్ ఆమోదించబడిందని, ప్రభుత్వం వివిధ రంగాలలో దిగుమతుల పెరుగుదలను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ తగిన చర్యలు తీసుకుంటోందని, అదనంగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమిడీస్ అక్రమ వాణిజ్య పద్ధతులపై చర్యలకు సిఫార్సు చేసే అధికారం కలిగి ఉందని కేంద్ర మంత్రి బదులి చ్చారు.మత్స్య పరిశ్రమ అభివృద్ధికి రూ.559.10 కోట్లు మంజూరు.ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద మత్స్యకారులకు కల్పించిన ప్రయోజనాలపై లోక్ సభలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్రమత్స్య, పశుసంవర్ధక మరియు పాల పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ బుధ వారం లిఖితపూ ర్వకంగా సమాధానం ఇచ్చారు.ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 39 కార్యకలాపాలకు రూ.2398.72 కోట్ల అంచనా వ్యయంలో రూ.559.10 కోట్లు కేంద్ర భాగస్వామ్యంతో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి మంజూరు చేయగా, 2020-21 నుండి 2024-25 మధ్య కాలంలో విడుదల చేసిన రూ.482.55 కోట్లలో రూ.328.13 కోట్లు వినియోగించినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నివేదించిందని కేంద్ర మంత్రి వెల్లడించారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా గత నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో 3,09,771 మంది లబ్ధిపొందారని కేంద్ర మంత్రి బదులిచ్చారు.

**ఏపీలో 99.58 శాతం ప్రజలకు మొబైల్ సేవలు**

గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్లో నిర్మించిన, అప్‌గ్రేడ్ చేసిన, నిర్మాణంలో ఉన్న మొబైల్ టవర్ల వివరాలపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర కమ్యూనికేషన్, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు.

గత ఐదేళ్లలో ఏపీలో 28803 టవర్లు ఏర్పాటు చేయగా, ఏలూరు పార్లమెంట్ పరిధిలో 1128 టవర్లు అందుబాటులో ఉన్నాయని, మొబైల్ సెల్ టవర్ల నిర్మాణానికి రూ.642 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్రమంత్రి తెలిపారు. ఏపీలో 99.58 శాతం మంది ప్రజలు మొబైల్ సేవలు వినియోగించుకుంటున్నట్లు కేంద్రమంత్రి బదులిచ్చారు.

## జ్యోతి స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో క్యాపింగ్ సెర్మని





తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ : జ్యోతి స్కూల్ ఆఫ్ నర్సింగ్ నందు క్యాపింగ్ సెర్మని కార్యక్రమం జ్యోతి సంస్థ అధినేత డి. వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఏరియా హాస్పిటల్ ఆర్ఎంవో సాంబశివరావు పాల్గొన్నారు. వీరితోపాటు ఏరియా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కీర్తి, డాక్టర్ నవీన్, డాక్టర్ అశ్విన మీరజ్, డాక్టర్ రూపస్,డాక్టర్ విద్య మేడం,పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ వన్మశ్రీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాధవరం వైద్యాధికారిణి డాక్టర్ సింధు, ఎస్ ఎం స్కూల్ ఇంచార్జ్ జీవి చంద్రశేఖర్. ఏరియా హాస్పిటల్ నర్సింగ్ సూపరిటెండెంట్ భాగ్యం, హెడ్ నర్స్ వెంకటలక్ష్మి ఈ కార్యక్రమంలో పాల్గొని క్యాప్స్ బహుకరించడం జరిగింది. ముందుగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ముఖ్య అతిథులు మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి విలువలు, ప్రాథమిక వైద్యంలో అందించవలసిన సేవలు,రోగి పై ఆత్మీయతతో కూడిన సేవలు అందించాలని కోరారు. నర్సింగ్ ఇన్స్టిట్యూట్ ట్యూటర్స్ ఆశ, సువర్ణలు సహకరించారు.

## బిజెపి సీనియర్ నేత యుగంధర్ సోదరుడికి గారపాటి పరామర్శ



**విజయవాడ /టి.నర్సాపురం, మేజర్‌న్యూస్:** అనారోగ్యంతో చికిత్సపొందుతున్న బీజేపీ సీనియర్ నాయకులు చాట్రాతి యుగంధర్ సోదరుడు కుశ కుమార్‌నీ బుధవారం కలిసి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి. విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందిన టీ.నర్సాపురం చేరుకున్న కుశ కుమార్‌ని పరామర్శించారు.అలాగే యుగంధర్‌కి ధైర్యం చెప్పి త్వరగా కోలుకుంటారని, ఆందోళన పడద్దని ఆయన ఓదార్చారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులపై 8 కేసులు నమోదు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరులో ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులపై 8 కేసులు నమోదు అయ్యాయి. ఉప రవాణా కమిషనరు షేక్.కరీమ్ ఆదేశాల మేరకు బుధవారం ఏలూరు జిల్లాలోని పలు విద్యా సంస్థల బస్సులను మోటారు వాహనాల తనిఖీ అధికారులు తనిఖీ చేశారు. ఫిట్నెస్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్, వాహన భీమా తదితర వాటిని పరిశీలించి, 8 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు డీటీసీ కరీమ్ తెలిపారు.ఈ తనిఖీల్లో వాహనాల తనిఖీ అధికారులు ఎస్.బి.శేఖర్, వై.సురేష్ బాబు, వై.ఎస్.వై.కళ్యాణి పాల్గొన్నారు.

## సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో ఘనంగా పునీత జోసెఫ్ పండుగ



**ఏలూరు,మేజర్ న్యూస్ :** సెయింట్ జోసెఫ్ దంత కళాశాల యందు పునీత జోసెఫ్ పండుగ ఘనంగా నిర్వహించారు. ఏలూరు పీఠం వికార్ జనరల్ పి.బాల,కళాశాల కరస్పాండెంట్ ,సెక్రెటరీ ఫాదర్ జి.మోజెస్ సారథ్యంలో సమిష్టి దివ్యబలి పూజ నిర్వహించారు. అనంతరం కళాశాల డిజిటల్ లైబ్రరీ లో కళాశాల చీఫ్ లైబ్రరీయన్ జి.కిషోర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. లైబ్రరీ యందు ఆటోమేషన్ ఫాదర్ పి.బాల ప్రారంభించారు. ఫాదర్ జి.మోజెస్ పీజీ ప్రాజెక్ట్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ ఎన్ స్లీవరాజు జర్నల్స్ ప్రారంభించారు. అనంతరం లైబ్రరీ సేవలు ఎక్కువగా ఉపయోగించుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు.కళాశాల ఆవరణలో జోసఫ్ జన్మదినోత్సవాన్ని ఆడిటోరియంలో జరిగింది. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పి జాకబ్ దంత కళాశాల హెచ్ఓడీస్,అధ్యాపకులు నర్సింగ్ విద్యార్థులు అధ్యాపకులు డెంటల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## బీసీ వర్గాల నుండి స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానం

మొదటిపేజీ తరువాయి

చేయుటకు 3 స్లాబులుగా విభజించడం జరిగిందన్నారు. యూనిట్ కాస్ట్ రూ.2 లక్షలు వరకు ఉన్న యూనిట్లకు 50శాతము సబ్సిడీలేదారూ.75వేలు మించకుండా,మిగిలిన సొమ్ము బ్యాంకు వారి ఋణముగా ఆర్థిక సహాయము అందించబడును. యూనిట్ విలువ రూ.2 లక్షలు నుండి రు.3 లక్షలు వరకు ఉన్న యూనిట్లకు 50 శాతము సబ్సిడీ లేదా రు.1,లక్ష 25వేలు మించకుండా, మిగిలిన సొమ్ము బ్యాంకు వారి ఋణముగా ఆర్థిక సహాయము అందించబడును.యూనిట్ కాస్టు రు.3. లక్షలు నుండి రూ.5. లక్షలు వరకు ఉన్న యూనిట్లకు 50 శాతము సబ్సిడీ లేదా రూ.2లక్షలు మించకుండా, మిగిలిన సొమ్ము బ్యాంకు వారి ఋణముగా ఆర్థిక సహాయము అందించబడును.జనరిక్ ఫార్మశీలు మంజూరుకు యూనిట్ కాస్టు రు.8 లక్షలకు గాను సబ్సిడీ రు.4 లక్షలు మిగిలిన సొమ్ము బ్యాంకు వారి ఋణముగా ఆర్థిక సహాయము అందించబడునని తెలియజేయడమైనది. వెనుకబ డిన తరగతులకు చెందిన మేదర, కుమ్మరి శాలివాహన కులస్తులు 3 నుండి 5 గురు సభ్యులు గ్రూపుగా ఏర్పడి వృత్తిపరముగా బుట్టల అల్లకము, కుండల తయారీకి యూనిట్ కాస్టు రు.3. లక్షలుకు గాను సబ్సిడీ రు.1.50 లక్షలు, మిగిలిన సొమ్ము బ్యాంకువారి ఋణముగా ఆర్థిక సహాయము అందించడం జరుగుతుందన్నారు.లబ్ధిదారులు 21 సం.లు నుండి 60 సం.లు మధ్య వయస్సు కలిగి వారు రైస్ కార్డు, కమ్యూనిటీ సర్టిఫికెట్, జనరిక్ ఫార్మసీ కొరకు బి ఫార్మసీ లేక డి ఫార్మసీ సర్టిఫికెట్ కలిగినవారు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన లబ్ధిదారులు నేరుగా వారి రైస్ కార్డు, ఆధార్ కార్డు, పాస్పోర్టు సైజు ఫొటో, మొబైల్ ఫోను, మీ-సేవా లేక గ్రామ సచివాలయము ద్వారా తీసుకోబడిన కుల ధృవపత్రము, విద్యార్హతలు, పథకము మంజూరుకు కావలసిన అనుభవం వగైరా సర్టిఫికెట్లతో దగ్గరలో ఉన్న నెట్ సెంటరు లేక మీ సేవా లేక గ్రామ సచివాలయములో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కాపు సామాజిక వర్గములోని కాపు, తెలగ బలిజ, ఒంటరి సామాజిక వర్గముల వారికి స్వయం ఉపాధి మరియు గ్రూపుగా ఎంఎస్ఎంఈ పథకముల క్రింద ఆర్థిక సహాయము చేయడం జరుగుతుందని, స్వయం ఉపాధి పథకము నందు ఆర్థిక సహాయము చేయుటకు సబ్సిడీని మూడు స్లాబులుగా విభజించడం జరిగిందన్నారు.యూనిట్ కాస్టు రూ.2.లక్షలు వరకు ఉన్న యూనిట్లకు 50 శాతముసబ్సిడి లేదారూ.1లక్ష మించ కుండా, మిగిలిన సొమ్ము బ్యాంకు వారి ఋణముగా ఆర్థిక సహాయము అందించబడును.యూనిట్ కాస్టు రూ.2 లక్షలు నుండి రూ.3. వరకు ఉన్న యూనిట్లకు 50శాతము సబ్సిడీ లేదారూ. యూనిట్ కాస్టు రూ.3.లక్షల నుండి రూ.5లక్షలు వరకు ఉన్న యూనిట్లకు 50శాతము సబ్సిడీ లేదా రూ.2.50,000/-లు మించకుండా, మిగిలిన సొమ్ముబ్యాంకువారి ఋణముగా ఆర్థిక సహాయము అందిం చబడును. ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, మధ్య ఎంటర్ప్రైజెస్) యూ నిట్ల ఏర్పాటుకు మొత్తం రూ.25 లక్షలకు గాను రూ.10 బ్యాం కు లోను, రూ.10లక్షలు సబ్సిడీ, లబ్ధిదారుని కంట్రిబ్యూషన్ రు.5 లక్షలుగా ఉంటుందన్నారు.స్వయం ఉపాధి పథకము నందు ఆర్థిక సహాయము చేయుటకు లబ్ధిదారులు 21 సం.లు నుండి 50 సం.లు మధ్య వయస్సు వారై ఉండాలన్నారు. రైస్ కార్డు, కమ్యూనిటీ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలి. ఎం.ఎస్.ఎం.ఇ పథకం నందు ఆర్థిక సహాయం చేయుటకు గ్రూపుగా 3 నుండి 5మంది లబ్ధిదారులు ఉండాలని, లబ్ధిదా రుల వార్షిక ఆదాయము రు.8 లక్షలు లోపు ఉండాలన్నారు.

## 8వ ఆర్థిక గణనకు జిల్లాస్థాయి కమిటి

**ఉత్తర్వులు జారీచేసిన జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి**

**ఏలూరు, మేజర్‌న్యూస్ :** వచ్చే నెల నుండి దేశవ్యాప్తంగా 8వ ఆర్థిక గణన నిర్వహించనున్న నేపధ్యంలో ఆర్థికగణనను సులభతరం చేయడానికి జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటుచేస్తూ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా కలెక్టర్ చైర్ పర్సన్‌గా, మెంబర్ కన్వీనర్‌గా జిల్లా ఎకనా మిక్స్, స్టాటిటిక్స్ ఆఫీసర్(సిపివో) వ్యవహరిస్తారు.

జిల్లా ఎస్పీ, జిల్లాలోని అందరు మున్సిపల్ కమీషనర్లు, జిల్లా పరిశ్రమల అధికారి, డిఐపిఆర్ఓ, ఇన్ స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, డిపివో, కార్మిక శాఖ అసిస్టెంట్ కమీషనరు, ఎన్ఎస్ఎస్ఓ ప్రతినిధి, జిల్లాస్థాయి ఐటి నిపుణులు, సభ్యులుగా ఉంటారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఆర్థిక గణనను సులభతం ంగా కొనసాగిం చేందుకు జిల్లాస్థాయి కమిటీ పర్యవేక్షిస్తుంది.

# ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర సిపిఎం ధర్నా




**నరసాపురం, మేజర్‌న్యూస్ :** స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ట్యూబెక్టమి ఆపరేషన్లు చేయాలని కిడ్నీ పేషెంట్లకు డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ సౌకర్యం కల్పించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ప్రభుత్వ హాస్పిటల్ వద్ద ధర్నా నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ తీర ప్రాంతంలో ప్రధానంగా ఉన్న ఏరియా ఆసుపత్రిలో వందలాదిమంది గర్భిణీ స్త్రీలు పురుడు పోసుకుంటున్నారున్నారు. వారికి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయాలంటే హాస్పటల్లో ఆపరేషన్ చేయకపోవడం వల్ల ప్రైవేట్ హాస్పిటల్ లో ఆపరేషన్ చేయించుకోవాలంటే సుమారు 25 వేల రూపాయలు ఖర్చు అవుతుందని సామాన్య ప్రజలు ఈ ఖర్చును భరించలేక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఏరియా హాస్పిటల్‌లో ట్యుబెక్టమి ఆపరేషన్ చేయాలని డిమాండ్ చేశారు. తీర ప్రాంతంలో కిడ్నీ పేషెంట్లు పెరుగుతున్నారన్నారు. వీరికి డయాలసి స్ చేయించుకోవాలంటే దుర‌ప్రాంతంలో ఉన్న ప్రైవేట్ హాస్పిటల్‌కి వెళ్లి వేలాది రూపాయలు చెల్లించి డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితితో అనేక బాధలు పడుతున్నారన్నారు.కిడ్నీ బాధితులను దృష్టిలో ఉంచుకొని హాస్పిటల్‌లో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ సదుపాయం లేక బయట స్కానింగ్ సెంటర్లో వేలాది రూపాయలు ఖర్చుపెట్టి స్కానింగ్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. హాస్పిటల్లోనే గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ సదుపాయాన్ని కల్పించాలన్నారు. అన్ని రకాల రోగాలకు వైద్యులని నియమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలను ఏరియా హాస్పటల్ ద్వారా కల్పించాలని డిమాండ్ చేశారు.

అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆస్పటల్ సూపరిడెంట్ డాక్టర్ సుప్రియకి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు పి పూర్ణ,పట్టణ కమిటీ సభ్యులు మంచిలి నీలకంఠం, పి నారాయణ రావు,బి జోగేశ్వరరావు,మండల కమిటీ సభ్యులు కడలి రవి,గుబ్బల నాగేశ్వరరావు,కటెం నరేష్, చింతపల్లి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరులో దారి దోపిడీ చేసిన ముఠా సభ్యుల అరెస్ట్




**ఏలూరు క్రైమ్, మేజర్‌న్యూస్ :** ఏలూరు డిఎస్పి శ్రావణ్ కుమార్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 22వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో ఏలూరు ఒకటో పట్టణ పరిధి అగ్రహారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఒక ప్రైవేట్ బ్యాంకు కలెక్షన్ ఏజెంట్ వ్యక్తిని అడ్డగించి కళ్ళల్లో కారం కొట్టి రెండున్నర లక్షల రూపాయలు దొంగతనం చేసిన ముగ్గురు ముఠా సభ్యులు అరెస్ట్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఏలూరు ఒకటో పట్టణ పోలీసులు ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు మూడు బృందాలుగా ముద్దాయిలను గాలించి ఏలూరు రైల్వే స్టేషన్ గూడ్స్ షెడ్ రోడ్‌లో ముద్దాయిలు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారన్న సమాచారంతో బుధవారం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి లక్ష 90 వేల నగదును ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారని. ముద్దాయిల వివరాల్లోకి వెళ్తే ఏ-1 గుమ్మల మణికంఠ,ఏ-2 కల్లపల్లి దుర్గా వెంకట కొండలరావు, అదుపులోకి తీసుకోవడంజరిగిందని ఇలాంటి సంఘటనల కు ఎవరైనా పాల్పడితేచట్టరీత్యా తగిన చర్యలు తీసుకోబడుతుందని డీఎస్పీ శ్రావణ్ కుమార్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏలూరు ఒకటవ పట్టణ సిఐ సత్యనారాయణ ఎస్ఐ మదీనా భాష సిబ్బంది పాల్గొన్నారు.

# బాలికల సంరక్షణ కోసం శక్తి యాప్





**విద్యార్థినిలు,గృహనీలు,బాలికలు,మహిళలకు,అత్యవసర పరిస్థితుల్లో రక్షణ**

**కైకలూరు,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం మహిళలు, బాలికల సంరక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన "శక్తి యాప్" ఉపయోగాలు లక్ష్యంగా ప్రజలకు తెలియజేశారు.కైకలూరు టౌన్‌ఇన్స్పెక్టర్ కృష్ణ ఆధ్వర్యంలో మహిళా పోలీస్ సిబ్బంది, శక్తి టీం సభ్యులు బుధవారం వై.వి.ఎన్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి యాప్ ఉపయోగాలు, అత్యవసర సమయంలో ఎలా సహాయపడుతుందో వివరించడంతో పాటు, విద్యార్థినుల ఫోన్లలో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసి ఉపయోగించాల్సిన విధానం గురించి వివరించారు.అత్యాచారాలు,ఇతరహింసాత్మక సంఘటన లను నివారించడానికి ఉపయోగపడుతుంది. అత్యవసర సహాయం – మహిళలు ఏదైనా ప్రమాదకర పరిస్థితిలో ఉన్నప్పుడు, ఈ యాప్ ద్వారా పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వవచ్చు. ఒక క్లిక్ ఎస్ ఓ ఎస్ అలర్ట్ – ఒక్క కీ నొక్కితే పోలీసులకు, కుటుంబసభ్యులకు, లేదా స్నేహితులకు అప్రమత్తమైన సందేశం వెళ్ళిపోతుంది. జియో-లోకేషన్ ట్రాకింగ్-అత్యవసర పరిస్థితుల్లో, పోలీస్ కంట్రోల్ రూమ్ మహిళ ఉన్న ప్రదేశాన్ని తక్షణమే గుర్తించి సహాయం అందించగలదు. నేరం నివేదిక వేధింపు, లైంగిక దాడి, ఎవరైనా శారీరకంగా హాని కలిగించినప్పుడు, మహిళలు ఈ యాప్ ద్వారా నేరాన్ని అధికారులకు తెలియజేయవచ్చు.సమాచార అవగాహన – మహిళా హక్కులు, రక్షణ చట్టాలు, ప్రభుత్వ నిబంధనల గురించి పూర్తి వివరాలు పొందవచ్చు. ప్రత్యక్ష పోలీస్ సహాయం – సమీపంలోని పోలీస్ స్టేషన్ సమాచారం, హెల్ప్‌లైన్ నంబర్లను యాప్‌లో పొందుపరిచారు. వాయిస్, వీడియో రికార్డింగ్ – ఏదైనా సంఘటన జరుగుతున్నప్పుడు, శబ్దాన్ని లేదా వీడియోను రికార్డు చేసి పోలీసులకు పంపే అవకాశం ఉంది. **మహిళలు, బాలికలు విద్యార్థినులు, ఉద్యోగినులు, గృహిణులు..** అత్యవసర పరిస్థితుల్లో రక్షణ అవసరమైన వారు. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా శక్తి యాప్ ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఏదైనా ప్రమాదం జరిగితే, యాప్ ఓపెన్ చేసి ఎస్ ఓ ఎస్ బటన్‌ను నొక్కితే, మీ స్థానాన్ని గుర్తించి పోలీసులు తక్షణమే స్పందిస్తారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ, మహిళల భద్రత ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉంది అని, అత్యవసర సమయంలో శక్తి యాప్ ద్వారా పోలీస్ సాయం తక్షణమే అందుబాటులోకి వస్తుందని తెలియజేశారు. ప్రతి మహిళ, బాలిక ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, భద్రత కోసం వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైవిఎన్ఆర్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ వై శ్రీలత వైస్ ప్రిన్సిపల్ జి.ప్రసన్న మరియు పోలీసు అధికారులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## చేపల చెరువులో కూలిపనికి వెళ్లి వ్యక్తి మృతి



**మండవల్లి, మేజర్ న్యూస్:** చేపల చెరువులో కూలిపనికి వెళ్లి వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన మండవల్లి మండలంలో బుధవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం కైకలూరు మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన పట్టపు మల్లేశ్వరరావు (48) కూలి పనులు నిమిత్తం మండవల్లి మండలంలోని కాకతీయ నగర్ లోని చెరువులో చేపల పట్టుబడి నిమిత్తం వెళ్లాడు. మిత్రులతో కలసి పట్టుబడి నిమిత్తం చెరువులోనికి వెళ్లగా ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయాడు.

## మంచినీటి చెరువులు పరిశీలించిన జడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ



**భీమడోలు,మేజర్‌న్యూస్ :** భీమడోలు మండలంలో ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ బుధవారం పర్యటించారు. ఈమేరకు తొలుత గుండుగొలను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారిణి అనురాధాతో కలిసి సందర్శించి కేంద్రం పనితీరును పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్త సేకరణ సంబంధించిన వివరాలను జడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ వర్మీకంపోస్ట్ ఎరువు తయారీవిధానం, కేంద్రంలోని యంత్రాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆగడాలంక, మల్లవరం, చెట్టున్నపాడు గ్రామాల్లోని మంచినీటి చెరువులను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి చైర్ పర్సన్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రానున్న వేసవిలో గ్రామాల్లో త్రాగునీరు ఇబ్బందిని అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకున్నామని, ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా శానిటేషన్ డ్రైవ్ చేపట్టినట్లు పలు అంశాలను చైర్ పర్సన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మావతిదేవి, స్థానిక అధికారులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు, బాలికల సంరక్షణ కోసం శక్తి యాప్



**ఏలూరు క్రైమ్ మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం మహిళలు బాలికలు సంరక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి యాప్ ఉపయోగాలను ప్రజలకు తెలియజేయడమే లక్ష్యంగా ఏలూరు జిల్లా ఎస్పీ కే.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై బుధవారం స్థానిక నరసింహారావుపేటలో ఉన్న ఎన్ఆర్ఐ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం.సుబ్బారావు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శక్తి యాప్ ఉపయోగాలు అత్యవసర సమయంలో ఇది ఎలా సహాయపడుతుందో వివరించడంతోపాటు విద్యార్థినిల ఫోన్లలో శక్తి యాప్ డౌన్లోడ్ చేసి ఉపయోగించాల్సిన విధానం వివరించడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ మహిళల భద్రత ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉందని ఆయన అన్నారు. అత్యవసర సమయంలో శక్తి యాప్ ద్వారా పోలీసు యొక్క సహాయము నిమిషాల వ్యవధిలో అందుబాటులోకి వస్తుందని ప్రతి మహిళా,బాలిక ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకొని భద్రత కోసం ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు మహిళా పోలీస్ సిబ్బంది శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.

# పివి రావు మాలమహానాడు ఆధ్వర్యంలో ఎస్సి వర్గీకరణకు నిరసన



పాలకొల్లు,మేజర్ న్యూస్: స్థానిక గాంధీ బొమ్మల సెంటర్ నందు పివి రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యావరప్రసాద్ రావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. తప్పుల తడకతో కూడిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదిక ఆధారంగా ఎస్సి వర్గీకరణకు మద్దతుగా రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిన దానిని వ్యతిరేకిస్తూ బుధవారం నిరసన కార్యక్రమం చేశారు. తప్పుల తడకతో కూడిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ను రద్దు చేసి హైకోర్టు జడ్జీలతో త్రిసభ్య కమిటీ వేసి న్యాయవిచారణ చెయ్యాలని పివి రావు మాలమహానాడు డిమాండ్ చేస్తుంది. అలాగే ఈకేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు దళితలపై చిత్త శుద్ధి ఉంటే ప్రస్తుతం ఉన్నటువంటి 15 శాతం రిజర్వేషన్ ను అమలు చేస్తూ మాదిగలకు అదనంగా 10 శాతం రిజర్వేషన్ కలిపించాలి. 2011 పెరిగిన జనాబా నిష్పత్తి ప్రకారం ప్రతి ప్రయివేట్ సెక్టర్ లో రిజర్వేషన్ శాతాన్ని కల్పించాలి,ఈ కూటమి ప్రభుత్వం మాలలు వై ఎస్ ఆర్ పార్టీకి ఓటు వేసారు. అనే ఉద్దేశ్యంతోనే మాలలపై కక్ష కట్టి ఎస్సి వర్గీకరణ అంశాన్ని తెరపైకి తేవటం జరిగింది. ఈ కేంద్ర ,తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు మాలలను మనుషులుగా కాక కేవలం ఓటు బ్యాంకు రాజకీయంగా మాత్రమే చూస్తున్నారు.ఈ విష్యాన్ని మాల లంతా గమనించి వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వాలకు సరైనా గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేస్తున్నాము, 1997లో మాలల ఆగ్రహానికి గురై అధికారం కోల్పోయినా సంఘటన ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు మర్చిపోయినట్టున్నారు.వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా మాలల సత్తా ఏమిటో చూపిస్తాం అన్నారు. ఈకేంద్ర, తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను మట్టికరిపిస్తామని పివిరావు మాలమహానాడు హెచ్చరిస్తుంది. వచ్చే నెల 10 న పి వి రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షులు పండు అశోక్ పిలుపు మేరకు పెద్ద ఎత్తున కాకినాడలో భారీ బహిరంగా సమావేశం నిర్వహించి అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి శ్రీకారం చూడతామని విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కొర్రపాటి వీరాస్వామి, మొగల్తూరు,పాలకొల్లు,యలమంచిలి మండలం అధ్యక్షులు ఇంజేటి కుమార్ స్వామీ,చెరుగొండి పద్మకిషోర్, బుంగా జయరాజు,జిల్లా మీడియా అధ్యక్షుడు దేవా రాజేష్,సీనియర్ నాయకులు బండి సుందర్ రామూర్తి,పెదపాటి పెద్దిరాజు, ముడకల గోపాల రావు, వర్ధనపు,ఆనంద్ రావు, వర్ధనపు.సురేష్, రాజబాబు, వెంకటపతి, గోగులమండ దాసు,జల్లి అనిల్,బొంధా. బుజ్జిబాబు,టి రత్నరాజు,తదితరులు పాల్గొన్నారు

# డిసిసిబి ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు

## - జేసి,ప్రత్యేక అధికారి ధాత్రిరెడ్డి




ఏలూరు,మేజర్ న్యూస్ : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ,జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రత్యేక అధికారి పి.ధాత్రిరెడ్డి అన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మహాజన సభ స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో బుధవారం జేసి, డిసిసిబి ప్రత్యేక అధికారి ధాత్రిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు వ్యవసాయ సీజన్ సమయంలో పంట రుణాలు అందించాలని,రైతులు దరఖాస్తు చేసిన 20 రోజులలలోగా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో వ్యాపార కార్యకలాపాలను పూర్తిస్థాయిలో కంప్యూటరీ కరించాలన్నారు. డిసిసిబి వ్యాపార పరిధిని మరింత విస్తరించి, బ్యాంకును మరింత అభివృద్ధి చేయాలన్నారు.

స్వయం సహాయక సంఘాల మహిళల నుండి రుణాల రికవరీలు నూరుశాతం ఉన్నాయని,వారి స్వయం ఉపాధికి రుణాలను అందించి మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని జేసీ సూచించారు. నిరర్ధక రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి రుణాల వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు.

రుణాలను సక్రమంగా చెల్లించే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ర్యాంకింగ్ విధానాన్ని అమలు చేస్తామని, వారికి వడ్డీలో కొంత మొత్తం రాయితీపై రుణాలను అందిస్తామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాబడి, వ్యయాలను ఆమోదించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను కూడా సభలో ఆమోదించారు. సమావేశంలో జిల్లా సహకార శాఖాధికారి ఏ.శ్రీనివాస్,డిసిసిబి సీఈఓ సింహాచలం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులు, సహకార శాఖ పర్సన్ ఇంచార్జ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తే చర్యలు



ఇరగవరం, మేజర్ న్యూస్ : రైతుల పట్ల అమర్యాదగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని కంతేరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ప్రత్యేక అధికారి యమ్.యమ్.రహమాన్ సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం మండలంలో కంతేరు సొసైటి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సర్వసభ్య సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. పురుగుమందులు నాణ్యమైన ప్రముఖ బ్రాండ్ల అందుబాటులో ఉంచాలని కొంతమంది రైతులు కోరగా వెంటనే తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి సంవత్సరం రైతులకు చెల్లించవలసిన షేరుధనం (డివిడెంట్) 4సంవత్సరాలనుండి బకాయిలు ఉన్నందున రెండు సంవత్సరాల సొమ్మును వెంటనే విడుదల చేస్తామని చెప్పారు. గోనెసంచులు, పురుగుమందులు సరఫరాలో అన్నివేళల్లో రైతులు అందుబాటులో ఉండాలని రైతులు కోరారు. ఒక ఎకరా భూమికి 5నుంచి 10లక్షలు రేయితీ లేని రుణాలను అందించనున్నట్లు చెప్పారు. దీనికి ఒక రూపాయి వడ్డీకి రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు.ఎరువులు కొరత లేకుండా ప్రణాళిక రూపొందించడానికి త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.సొసైటీ పరిధిలోని మూడు గ్రామాలలో ఒక్కో గ్రామం నుండి ఒక్కొక్కరు చొప్పున ఒక కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కమిటీ ద్వారా ఎరువులు, పురుగు మందులు ఎంత అవసరం, సొసైటీ పరిపాలన తదితర కార్యనిర్వాహణలు కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తారని చెప్పారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు మళ్లిడి శ్రీనివాస్, గోపాలరెడ్డి, సెక్రటరీ కె. శ్రీనివాస్, కంతేరు, కత్తవపాడు గ్రామాల రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## పి-4 సర్వే క్యూఆర్ కోడ్, పోస్టర్‌ను ఆవిష్కరించిన కో-ఆప్షన్ సభ్యులు పెదబాబు





ఏలూరు,మేజర్‌న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా అభిప్రాయ సేకరణ కోసం నూతనంగా ప్రవేశపెట్టిన పి-4 సర్వే కు సంబంధించిన క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను బుధవారం ఏలూరులోని నగరపాలక సంస్థ కార్యాలయంలో కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెద్దబాబు ఆవిష్కరించారు. అనంతరం పెన్షన్ల పంపిణీ విధానంలో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అధునాతన టెక్నాలజీతో రూపొందించి రాష్ట్ర ప్రభుత్వం పంపిన బయోమెట్రిక్ డివైజ్‌లను ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో పెన్షన్ల పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వందరాణి దుర్గ భవాని, పిఓ మహాలక్ష్మి, కో ఆప్షన్ సభ్యులు నీత విజయ్ కుమార్, జలా సుమతి,నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారమే భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలి కమిషనర్



నరసాపురం,మేజర్‌న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన విధి విధానాలను అనుసరించి నూతన భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలనిమున్సిపల్ కమీషనర్ ఎం అంజయ్య తెలిపారు. బుధవారం ఆయనచాంబర్‌లో టౌన్ ప్లానింగ్ లైసెన్స్ కలిగిన వారితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధన లకు లోబడే నిర్మాణాలు జరగాలని, ఇటీవల కాలంలో వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. అడ్డగోలుగా, అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు చేపట్టే వారిపై ప్రభుత్వ నిబంధన ప్రకారం, ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు చేపడతామని కమీషనర్ అన్నారు. ఈకార్యక్రమంలో ఎంవివి సత్యనారాయణ,టౌన్ ప్లానింగ్ సెక్రెటరీలు, లైసెన్స సర్వేయర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి తీరుతాం

**ఎమ్మెల్యే బడేటి చంటి**



ఏలూరు, మేజర్‌న్యూస్ : సూపర్ సిక్స్ పథకాలన్నీటిని ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సక్సెస్ఫుల్గా అమలు చేసే బాధ్యతను కూటం ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహిస్తుందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో బుధవారం అనేక సమస్యలపై వినతుల అందించేందుకు వచ్చిన ప్రజానీకానికి నేను ఉన్నానంటూ భరోసా కల్పించి మీ సమస్యలు పరిష్కరించే దాకా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా రూపుదిద్దుకున్న సూపర్ సిక్స్ మేనిఫెస్టోలోని హామీలన్నిటిని సమర్థవంతంగా నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వ అధినేతలు ప్రత్యేక దృష్టి సాధిస్తున్నారని అందుకు అవసరమైన ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాం అని ఆయన స్పష్టం చేశారు. ప్రజల సమస్యలపై వినతి పత్రాలు సేకరించిన ఎమ్మెల్యే బడేటి చంటి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిరంజీవి, త్రిపర్ణ రాజేష్, బొద్దాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నిత్యవసర సరుకులు పంపిణీలు అవకతవకలు జరిగితే చర్యలు



**భీమవరం,మేజర్ న్యూస్:** నిత్యవసర సరుకులు పంపిణీలో అవకతవకులు జరిగితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో పౌరసరఫరాల అధికారులు, ఎండియు, రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్స్, సెక్రటరీలు, గ్యాస్ డీలర్ల ప్రతినిధులతో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి సమావేశమై నిత్యవసర సరుకులు పంపిణీ, దీపం-2 గ్యాస్ సిలిండర్ల సరఫరాపై సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన, ఖచ్చితమైన కొలతలతో నిత్యవసర సరుకులు పంపిణీ జరగాలనే ధ్యేయంతో పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. దీనిలో భాగంగా ఐవిఆర్ఎస్ ద్వారా అమరావతి నుండి నిత్యవసర సరుకులు పంపిణీ పై ప్రజలు వెలిబుచ్చుతున్న అభిప్రాయాలను సమీకరిస్తుందని, అలాగే దీపం పథకం గ్యాస్ సిలిండర్ల సరఫరా పై కూడా అభిప్రాయాలను తెలుసుకుంటుందన్నారు. జిల్లాలో నిత్యవసర సరుకులు పంపిణీ పై ప్రజల నుండి సేకరించిన సర్వే ప్రకారం కొంత అసంతృప్తి ఉన్నట్లు తేలిందన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యవసర సరుకులు డీలర్లు, ఎండియు ఆపరేటర్లు విని యోగదారుల నుండి అదనపు రుసుము వసూలు చేసిన, కొలతలలో తేడా చేసిన శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.డీలర్ షాపులు, ఎండియు వాహనదారులు ఏ తేదీన సరుకులు అందజేస్తారో కార్డుదారులకు ముందుగా సమాచారాన్ని తెలిపాలని అన్నారు. జిల్లాలో కొంతమంది అదనపు రుసుము వసూలు చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, అటువంటి వారిపై విచారణ చేసి వాస్తవం అయితే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎక్కడ ఒక్క రూపాయి కూడా అదనంగా వసూలు చేయకుండా ప్రభుత్వ నిబంధన ప్రకారం ఇంటి వద్ద నిత్యవసర సరుకులు అందించాలని సూచించారు. పేదలకు అందిస్తున్న పథకాలను సక్రమంగా అందజేసి ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో డిఎస్ఓ ఎన్.సరోజ, ఏఎస్ఓ ఎం.రవిశంకర్, జిల్లాలోని సివిల్ సప్లైస్ డిటిలు,సిఎస్ ఆర్ఐలు, రేషన్ డీలర్ల, ఎండియుల ప్రెసిడెంట్, సెక్రటరీలు,గ్యాస్ కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఐఈఈఈ ఓ విజ్ఞాన గని





**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ (ఐ ఈఈఈ) ఓ విజ్ఞాన గని అని, అందులోని జ్ఞానాన్ని ఎవరైతే సద్వినియోగం చేసుకుంటారో వారు ఉన్నత స్థానాలకు ఎదుగుతారని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ పూర్వ జనరల్ మేనేజర్ డాక్టర్ కప్పగంటు రామకృష్ణ తెలిపారు. నిట్ లోని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం,డిఎస్ఐఆర్- సిఆర్టిడిహెచ్, ఐ ఈఈఈ నిట్ స్టూడెంట్స్ బ్రాంచ్, ఐ ఈఈఈ పిఈఎస్, పిఈఎల్ఎస్ ఆధ్వర్యంలో జాయింట్ చాప్టర్ వైజాగ్ బే విభాగం సహకారంతో స్మార్ట్ గ్రిడ్ లో అధునాతన సాంకేతికతలు, భవిష్యత్తు అవకాశాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు ఐ ఈఈఈ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్ ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ డాక్టర్ వి.సందీప్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి రమేష్ మాట్లాడుటూ ఆధునిక పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు అన్ని అంశాలపై అవగాహనను పెంచుకోవటం తో పాటు సాంకేతికతపై పట్టు సాధించాలన్నారు.

ఐ ఈఈఈలో సభ్యత్వం తీసుకోవటం ద్వారా నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం రామకృష్ణను ఆచార్యులు ఘనంగా సత్కరించారు. ప్రయోగశాలలను తిలకించారు. ఈకార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ పి.శంకర్, డాక్టర్ కిరణ్ తీపర్తి, డాక్టర్ వీరా కుమారి, డాక్టర్ మధు, డాక్టర్ దిలీప్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర కళాశాలలో విద్యార్థులకు బహుమతులు



**నరసాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** మండలంలోని సీతారామపురంలో గల స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు కళాశాల అధ్యాపకులకు, పాలిటెక్నిక్ విద్యార్థినీ విద్యార్థులకు కళాశాల అంతర్గత గేమ్స్ నిర్వహించారు. వివిధ విభాగాలలో జనవరి, 25వ తేదీ నుండి బుధవారం వరకు ఈ పోటీలు జరిగాయి. పోటీలలో బాలుర విభాగములో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్ బాల్, చెస్, బ్యాట్మింటన్ టన్ టన్ బాలికల విభాగములో కబడ్డీ, టగ్ ఆఫ్ వార్, చెస్ అలాగే ఆధ్యాపక బృందానికి క్రికెట్, టేబుల్ టెన్నీస్, బ్యాట్మింటన్, చెస్‌బీ మహిళా సిబ్బంది విభాగములో క్యారమ్స్, బ్యాట్మింటన్, చెస్ విభాగాలలో గత 50 రోజుల నుండి అంతర్గత పోటీలు నిర్వహించారు. బుధవారం బహుమతుల ప్రధానోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్టీసీ డిపోమేనేజర్ సుబ్బన్న రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ క్రీడల యొక్క ప్రాధ్యాన్యతలను ఉపయోగములను వివరించినారు. యాజమాన్యం తరపున మేనేజర్ ను సత్కరించారు. కళాశాల నుండి 2024-25 సం.రానికి జేఎన్టీయూ కాకినాడ సౌత్ జోన్ కి వివిధ విభాగాలలో బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నీస్, మొదలగు విభాగాలకు కె.కె.రవితేజా రెడ్డి (బాస్కెట్ బాల్), డి.సునీతా (టేబుల్ టెన్నీస్), డి.భీమేశ్వర్ (ఫుట్ బాల్), కె.సంతోష్ (కరాటే) లకు ఎంపికైన వారిని కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్స్ సిబ్బంది అభినందించారు.

అమరావతి యస్ ఆర్ ఎం యూనివర్సిటీలో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలలో కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు.వీరికికళాశాల యాజమాన్యం నగదు ప్రోత్సాహకాలు ఇచ్చి అభినందించింది. కార్యక్రమములలో కళాశాల ఛైర్మన్ కె.వి.సత్యనారాయణ, కోశాధికారి కె.వి.స్వామి గారు, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, కళాశాల పాలకవర్గ సభ్యులు ఏం.వి.రామచంద్రరావు, ప్రిన్సిపాల్ డా.ఎస్.సురేష్ కుమార్, ఉప ప్రిన్సిపాల్ డా.గోపీచంద్, సైట్ ప్రిన్సిపాల్ డా.పి.పండరీనాథ్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డా.ఏం.సాయి కిరణ్మయి వివిధ విభాగాలు హెచ్ఓడిలు కళాశాల పి.డి. కె.ఎస్.వి.ఎస్.ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## బొలిశెట్టి రాజేష్ పుట్టినరోజు సందర్భంగా మెగా మెడికల్ క్యాంపు



**తాడేపల్లిగూడెం, మేజర్‌న్యూస్:** శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తనయుడు లోటస్ విద్యాసంస్థల అధినేత బొలిశెట్టి రాజేష్ పుట్టినరోజు వేడుకలు పురస్కరించుకొని వీకర్స్ కాలనీ నాన్న కళ్యాణ మండపం వద్ద మెగా మెడికల్ క్యాంపు బుధవారం ఉదయం నిర్వహించారు. తాడేపల్లిగూడెం చైతన్య ఎమర్జెన్సీ హాస్పటల్ వ్యవస్థాపకులు కే సోమేశ్వరరావు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించి రెండు వందల మందికి వైద్య సేవలు అందించారు. చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్ వైద్య బృందం డాక్టర్ నిశ్చల్, బి దివ్యశ్రీ , ఎల్ వర్ధన్, ఏ నరేంద్ర కుమార్ తదితర వైద్యులు వైద్య సేవలు అందించారు. నీలపాల దినేష్ యాదవ్, జన సైనికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రక్త పరీక్షలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

## ముదినేపల్లిలో ప్రశాంతంగా రెండోరోజు పదోతరగతి పరీక్షలు



**ముదినేపల్లి,మేజర్‌న్యూస్ :** పదవ తరగతి పరీక్షలు ముదినేపల్లి మండలంలో రెండో రోజు హిదీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ముదినేపల్లి మండలంలో 4 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముదినేపల్లి జెడ్పి ఉన్నత పాఠశాలలో 193 మంది విద్యార్థులకు గాను 193 మంది హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 191 మందికి గాను 189 మంది విద్యార్థులు, సహాయమాత ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో 98 మంది గాను 98 మంది విద్యార్థులు , పెదగొన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 142 మందికిగాను 140 మంది విద్యార్థులు హాజరయ్యారు. మండలంలో 4 కేంద్రాలలో 624 మందికి గాను 620 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా 4 మంది విద్యార్థులు గైర్హజరైనట్లు ఎంఈఓ కె నరేష్ కుమార్ వివరించారు.

## వడాలి-సింగరాయపాలెం-కోరుకొల్లు రహదారి మరమ్మతులు



**ముదినేపల్లి,మేజర్‌న్యూస్ :** ముదినేపల్లి-సింగరాయపాలెం-కోరుకొల్లు ప్రధాన రహదారికి నిధులు మంజూరు కావడంతో మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. సుమారు 25 కిలోమీటర్ల ఆర్ అండ్ బి రహదారి శిధిలం కావడంతో రహదారి మరమ్మతులకు 4 కోట్లు నిధులు మంజూరు కావడంతో రహదారి పూర్తిగా దెబ్బతిన్న కొన్ని చోట్ల పనులు చేపట్టారు. వడాలి సెంటర్ నుండి ఈ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులు వేగవంతం చేసేందుకు నిర్ణిత సమయానికి పూర్తి చేయనున్నట్లు ఎఇ అరవింద్ వివరించారు.

# నిత్యావసరాలు పంపిణీలో అవకతవకులు జరిగితే చర్యలు



## – జేసి టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశం

**భీమవరం,మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో పౌరసరఫరాల అధికారులు,ఎండియు, రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్స్, సెక్రటరీలు, గ్యాస్ డీలర్ల ప్రతినిధులతో బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి సమావేశమై నిత్యవసర సరుకులు పంపిణీ, దీపం–2 గ్యాస్ సిలిండర్ల సరఫరాపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఐవిఆర్ఎస్ ద్వారా అమరావతి నుండి నిత్యవసర సరుకులు పంపిణీ పై ప్రజలు వెలిబుచ్చుతున్న అభిప్రాయాలను సమీకరిస్తుందని, అలాగే దీపం పథకం గ్యాస్ సిలిండర్ల సరఫరా పై కూడా అభిప్రాయాలను తెలుసుకుంటుందన్నారు.జిల్లాలో నిత్యవసర సరుకులు పంపిణీ పై ప్రజల నుండి సేకరించిన సర్వే ప్రకారం కొంత అసంతృప్తి ఉన్నట్లు తేలిందన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యవసర సరుకులు డీలర్లు, ఎండియు ఆపరేటర్లు వినియోగదారుల నుండి అదనపు రుసుము వసూలు చేసిన, కొలతలలో తేడా చేసిన శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డీలర్ షాపులు,ఎండియు వాహనదారులు ఏ తేదీన సరుకులు అందజేస్తారో కార్డుదారులకు ముందుగా సమాచారాన్ని తెలిపాలని అన్నారు. జిల్లాలో కొంతమంది అదనపు రుసుము వసూలు చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, అటువంటి వారిపై విచారణ చేసి వాస్తవం అయితే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఈ సమావేశంలో డిఎస్ఓ ఎన్.సరోజ,ఏఎస్ఓ ఎం.రవిశంకర్, జిల్లాలోని సివిల్ సప్లైస్ డిటిలు,సిఎస్ ఆర్ఐలు, రేషన్ డీలర్ల,ఎండియుల ప్రెసిడెంట్, సెక్రటరీలు, గ్యాస్ కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీకి బడ్జెట్లో కేటాయింపులు పెంచాలి



భీమడోలు,మేజర్ న్యూస్ : ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో కేటాయింపులు పెంచాలని, కూలీలకు రోజువారి రూ.600 రూపాయల కూలీతో పాటు, కనీసంగా 200 పని దినాలు కల్పించాలని, సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. లింగరాజు కోరారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలోని సిపిఎం బృందం. పొలసాని పల్లి గ్రామంలో పర్యటించింది. ఉపాధి హామీ పనులు కొనసాగుతున్న ప్రాంతాలకు వెళ్లి కూలీలను కలిశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ, వ్యవసాయ యాంత్రీకరణ విధానం వల్ల కూలీలకు ఉపాధి పనులు తగ్గాయన్నారు. కూలీలతో పాటు, వ్యవసాయ కార్మికులు కౌలు రైతులు పేద రైతులు ఉపాధి హామీ పథకంలో పాల్గొని జీవనాన్ని కొనసాగిస్తున్నట్టు తెలిపారు. ఇదే నేపథ్యంలో గత రెండు నెలల కాలంగా చేసిన ఉపాధి హామీ పనులకు కూలీల బకాయిలు పెరగడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.ఆ తరువాత సిపిఎం బృందం 15 సంవత్సరాల క్రితం ఇళ్ల పట్టాలు ఇచ్చిన అర్జావారిగూడెంలోని ఎన్టీఆర్ కాలనీ సందర్శించారు. నివాసితులతో మాట్లాడారు. ఈ మధ్యకాలంలో మూడు ప్రభుత్వాలు మారినప్పటికీ ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారికి రోడ్లు ,విద్యుత్ ,మంచినీరు వంటి సౌకర్యాలు ఏర్పడని. కారణంగా నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బాధ్యులు ఇకనైనా స్పందించి ఆ ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ ఆర్గనైజర్ కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

# పవిత్ర రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** స్థానిక ఇరిగేషన్ డేటా కాంప్లెక్స్ లో పవిత్ర రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు ని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చిలకపాటి దేవ ప్రకాష్ . ఎన్జీజీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఇరిగేషన్ ఎస్ఇ శ్రీపమ్మి నాగార్జున రావు,నీరు–ప్రగతి ఎస్ఇ వెంకట స్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.రాజు,ఎస్.జగదీశ్వర రావు,జిల్లా ఎన్జీజివోస్ అసోసియేషన్ కార్యదర్శి నెరుసు రామారావు.. అసోసియేట్ అధ్యక్షుడు నోరి శ్రీనివాస్ రాష్ట్ర పే అండ్ అకౌంట్స్ ఉద్యోగుల సంఘం సహా అధ్యక్షుడు తిరగటి వెంకట రమణ,ఇరిగేషన్ డీఈఈ లు పిడుగు గనిరాజు,పి.సీతారాం,ఇరిగేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఇమాం జనాబ్ మొహిద్దీన్ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదర,సోదరీమణులు ఏ విధంగా నిష్ఠ గా ఉండి సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాసం ఉండి ఖురాన్‌లో ఉన్న అంశాలను వివరించారు.

# 23 నుండి ఏప్రిల్ 14 వరకు సిపిఐ ప్రచార జాత

**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఈ నెల 23 సర్దార్ భగత్ సింగ్ వర్ధంతి నుండి ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి వరకు సిపిఐ శత వార్షికోత్సవాలు సందర్భంగా ప్రచార జాత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ తెలిపారు. బుధవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఏలూరు జిల్లా విస్తృత కార్య వర్గ సమావేశం మైసాక్షి వెంకటాచారి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన వనజ మాట్లాడుతూ ఇటీవల జరిగిన సిపిఐ జాతీయ కార్యవర్గము,రాష్ట్ర కార్యవర్గ సమావేశం చేసిన నిర్ణయాలను వివరించారు. 2025 డిసెంబర్ 26 నాటికి సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా సిపిఐ దేశంలోనూ రాష్ట్రంలోనూ మరియు ఏలూరు జిల్లాలో గత 100 సంవత్సరాలుగా నిర్వహించిన కార్యక్రమాలను సాధించిన విజయాలను ప్రస్తుత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను వివరిస్తూ ప్రచార జాత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.జిల్లాలో పోలవరం నిర్వాసితుల సమస్య, పోడు భూములు సమస్య, అడవి బంజర్లు ,అసైన్డ్ భూములు సమస్య ఇళ్ల స్థలాల సమస్య, టిట్కో ఇల్లు, వన సంరక్షణ సమితుల సమస్య ప్రజా సమస్యలపై ,అధిక ధరలపై ప్రచార కార్యక్రమంలో ప్రజలకు వివరించాలని ఆమె సూచించారు. జిల్లాలో పార్టీ నిర్వహించిన కార్యకలాపాల రిపోర్టును సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య నివేదిక ఇచ్చారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకర్ సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు ఎండి మునీరు బండి వెంకటేశ్వరరావు ఉప్పులూరి హేమ శంకర్,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సర్వేపల్లి సాయిబాబు,కారం ధారయ్య,బాడిస రాము,కొండేటి బేబీ,జెవి రమణ రాజు కంచర్ల గురవయ్య టీవీఎస్ రాజు తొర్లపాటి బాబు గొలిమే బాల యేసు తదితరులు మాట్లాడారు.




# లైన్ డిపార్ట్మెంట్లతో ప్రకృతి వ్యవసాయం బలోపేతం



**ఏలూరు,మేజర్ న్యూస్ :** మండల స్థాయి సత్సంగ సమావేశంలో ఖరీఫ్ సీజన్ కోసం వార్షిక కార్యాచరణ ప్రణాళికపై చర్చ జరిగింది.ఈ సమావేశంలో హార్టికల్చర్,వ్యవసాయం,జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పేదరిక నిర్మూలన మిషన్,స్వయం సహాయ గుంపులు నాయకులు, మండల సమాఖ్య కార్యనిర్వాహకులు వంటి ముఖ్యమైన శాఖలు పాల్గొన్నాయి. ఈ సమావేశం ప్రధానంగా ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌ను విజయవంతంగా అమలు చేయడానికి వివిధ శాఖలు తమ ప్రయత్నాలను సమన్వయం చేయాలని ఉద్దేశ్యంగా ఏర్పడింది, ముఖ్యంగా ఆగ్రికల్చరల్ డెవలప్మెంట్. సమావేశం సందర్భంగా, ప్రీ–మోన్సూన్ డ్రై సోవింగ్ పద్ధతులు, 365 రోజులు గ్రీన్ కవర్ వ్యూహాలు, ప్రకృతి వ్యవసాయం లైన్ శాఖలు ద్వారా అమలు చేసే ప్రణాళికపై చర్చ జరిగింది. డిపిఎం తాతారావు, అడిషనల్ డిపిఎం వెంకటేశ్ నేల ఆరోగ్యం మెరుగుపరచడం, వ్యవసాయంలో అధిక ఆదాయాలు అందించడం,ప్రకృతి వ్యవసాయం విలువపై ముఖ్యంగా చర్చించారు. ఈ సమావేశంలో ప్రీ–మోన్సూన్ డ్రై సోవింగ్‌ను విజయవంతంగా అమలు చేసి దాని ద్వారా లభించిన ప్రయోజనాలకు సంబంధించిన ఒక ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది. ఇందులో,తిరుములసెట్టి రాజు కౌలు రైతు పి.నాగరాజు గౌరవింపబడ్డారు.

# శక్తివంతమైన మహిళ ప్రఖ్యాత వ్యోమగామి సునితా విలియమ్స్



**చింతలపుడి,మేజర్ న్యూస్ :** స్థానిక చింతలపుడిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అనుమతితో భౌతిక శాఖ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపక సభ్యుల కోసం ప్రఖ్యాత వ్యోమగామి సునితా విలియమ్స్ ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్) లో అంతరిక్షంలో తొమ్మిది నెలల మిషన్ తర్వాత భూమికి తిరిగి రావడం శక్తివంతమైన చిత్రం,వీడియో ఫుటేజీని,ఐఎస్ఎస్‌లో విలియమ్స్ గడిపిన సమయంలో చిత్రీకరించిన వీడియోలను,శాస్త్రీయ పరిశోధనలు,అంతరిక్షంలో ప్రయోగాలు చేస్తున్నప్పుడు ఆమె ఎదుర్కొన్న సవాళ్లను ప్రొజెక్టర్ సహాయంతో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు జి జీవన్ మౌనిక మాట్లాడుతూ ఈ ప్రదర్శన, అంతరిక్ష అన్వేషణ గురించి అవగాహన వ్యాప్తి చేయడం,కళాశాల విద్యార్థుల యువ మనస్సులను ప్రేరేపించడం, తరగతి గదిలోకి అత్యాధునిక శాస్త్రీయ పురోగతులు, విజయాలను తీసుకురావడానికి దోహదపడుతుందని అభివర్ణించారు. విలియమ్స్ ప్రయాణం గురించి వివరణాత్మకంగా వివరించారు. చరిత్రలో అత్యంత నిష్ణాతులైన మహిళా వ్యోమగాములలో ఒకరిగా ఆమె పాత్రను పోషించారని కొనియాడారు. సునీత విలియమ్స్ వంటి వ్యోమగాముల అద్భుతమైన విజయాలను ప్రదర్శించడం ద్వారా విద్యార్థుల్లో భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆలోచన పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు,వివిధ విభాగ అధ్యాపకులు ఖగోళ శాస్త్రంలో ఇటువంటి సాహసపేతమైన ప్రయోగాలు నిర్వహిస్తున్న నాసాను అభినందిస్తూ కార్యక్రమాన్ని ముగించారు.

## మద్యం షాపులో పనిచేస్తున్న వ్యక్తి పై ఇనుప రోడ్డుతో దాడి



**ఉండ్రాజవరం,మేజర్ న్యూస్ :** ఉండ్రాజవరం జంక్షన్ వద్ద మద్యం షాపులో పనిచేస్తున్న వ్యక్తిపై బుధవారం ఉదయం ఇనుప రోడ్డుతో దాడి జరిగింది. తీవ్రంగా గాయపడిన వ్యక్తి షాపులో మద్యం విక్రయిస్తున్న పాతఊరుకు చెందిన సిర్రా పండుగా గర్తించారు. దుండగుడు బైక్ పై వచ్చి ఇనుపరాడ్‌తో విచక్షణారహితంగా దాడి చేసినట్లు సీసీ టీవీలో నిర్ధారణ అయింది. గాయపడిన బాధితుణ్ని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించిన స్థానికులు. సిసి ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు.

# కుమ్మరి రేవు ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కరించాలి






**– సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబి**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** కుమ్మరి రేవు ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో కుమ్మరి రేవు ప్రాంతంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబి మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా కుమ్మరి రేవు ప్రాంతంలో 1000 కుటుంబాలు నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం,అధికారులు స్పందించి కుమ్మరి రేవు ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ గత ఏడాది వేసవి కాలంలో కుమ్మరి రేవు ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రజలు ఆందోళన చేపట్టిన తరువాత కార్పొరేషన్ అధికారులు స్పందించి సమస్య పరిష్కారం కోసం తాత్కాలిక ఏర్పాట్లు మాత్రమే చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. అనంతరం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ల వర ప్రసాద్,కార్యవర్గ సభ్యులు మావూరి విజయ,అడ్డగర్ల లక్ష్మీ ఇందిర, కొల్లూరి సుధారాణి, ఉప్పులూరి లక్ష్మీ,భవాని, శాయన అభిలాష్ కుమార్,గొర్లి స్వాతి,జిల్లా సమితి సభ్యులు భజంత్రీ శ్రీనివాసరావు, వేంకట లక్ష్మీ, మంగ తాయారు,నాగ మణి, మేరీ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విజయరాయిలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఈనెల 20వ తేదీన నేడు విజయరాయిలో జరుగుతున్న కోకో రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక అన్నే భవనంలో అయన మాట్లాడుతూ ఈనెల 20న ఉదయం 10 గంటలకు పెదవేగి మండలం విజయరాయి, గాంధీనగర్ సీతారామ కళ్యాణమండపంలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సదస్సుకు రైతు సంఘాల రాష్ట్ర నాయకులను, ఏలూరు జిల్లాతో పాటు కోకో సాగు జరుగుతున్న తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి,శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుండి కోకో రైతులను ఆహ్వానించామని వివరించారు. అన్ని ప్రాంతాల నుండి కోకో రైతులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్నంగి సుబ్బారెడ్డి, బొల్లు రామకృష్ణ, కోనేరు సతీష్ బాబు, పలువురు కోకో రైతులు పాల్గొన్నారు.

## మృతి చెందిన వ్యాపారి కాశి నుండి నేత్రాల సేకరణ



**కామవరపుకోట, మేజర్ న్యూస్ :** కామవరపుకోటకు చెందిన వ్యాపారి కాశి బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. స్థానికులు చవ్వా రాం బాబు, వీరంకి రాజ్యలక్ష్మి కాశీ కుటుంబ సభ్యులను నేత్రదానం చేయాలని కోరడం జరిగింది. ఎంతో సహృదయంతో కాశి కుటుంబ సభ్యులు నేత్రదానానికి ఒప్పుకున్నారు. విజయవాడ ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రి సిబ్బంది కాశి నేత్రాలను సేకరించుకుని తీసుకువెళ్లారు కాశీ కుటుంబ సభ్యులు ముందుచూపుకు గ్రామస్తుల అభినందనలు తెలిపారు.

# ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి మరింత శిక్షణ : జేసి ధాత్రిరెడ్డి




**ఏలూరు,మేజర్ న్యూస్ :** గత వ్యవసాయ సీజన్లో రైతుల నుండి ధాన్యం కొనుగోలులో డిసిఎంఎస్ అత్యుత్తమ పనితీరుని కనపరిచిందని రాబోయే రబీ లో కూడా అదే స్ఫూర్తితో ధాన్యం సేకరణ చేసి రైతులకు మేలు చేయాలనీ జిల్లా జాయింట్ కలెక్టర్,జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ పర్సన్ ఇంచార్జ్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ సర్వజన సభ స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో బుధవారం జేసీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ సీజన్లలో పటిష్టమైన ప్రణాళికతో ధాన్యం కొనుగోలు చేసి రైతులకు ఎంతో సహకరిస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోలుపై సిబ్బంది మరింత శిక్షణ అందించాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబందించిన రాబడి,వ్యయాలను, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబందించిన బడ్జెట్ ప్రతిపాదనలను కూడా సభలో ఆమోదించారు. జిల్లా సహకార అధికారి ఏ. శ్రీనివాస్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిందని, సమాజాభివృద్ధిలో సహకార వ్యవస్థ పాత్రను ప్రజలలోనికి తీసుకువెళ్లి సహకార ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు నెలవారీ కార్యక్రమాలతో ప్రణాలిక రూపొందించామన్నారు. ఈ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 7వ తేదీన వరల్డ్ హెల్త్ డే సందర్భంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేయనున్నట్లు చెప్పారు. డిసిసిబి సీఈఓ సింహాచలం,డిసిఎంఎస్ రిజిస్ట్రార్,ప్రాధమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులు, సహకార శాఖ పర్సన్ ఇంచార్జ్ లు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 28వ తేదివరకు మొబైల్ ఆధార్ క్యాంప్‌లు

**ఇరగవరం,మేజర్ న్యూస్ :** మండలంలో 8రోజుల పాటు ఆధార్ కార్డు సవరణ క్యాంప్ నిర్వహించ నున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ.శ్రీనివాస్ చెప్పారు. ఈనెల 19నుండి 28వ తేదివరకు ఈ మొబైల్ ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 19 నుండి 25వరకు కె.ఇల్లిందలపర్రు, పేకేరు, రేలంగి,కంతేరు, కత్తవపాడు ఈ ఆధార్ క్యాంపులు జరుగుతాయని చెప్పారు అందరు పంచాయతీ అధికారులు,సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

## అడ్వాంటా కంపెనీ సేవలు అభినందనీయం : నారా శేషు





**పెదవేగి,మేజర్ న్యూస్ :** నడిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో అడ్వాంటా కంపెని వారు కంప్యూటర్ ప్రింటర్ ,ఐరన్ బీరువాలు ఇతర సామాగ్రిని ఏలూరు జనసేన నాయకులు నారా శేషు ద్వారా స్కూల్‌కి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా నారా శేషు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలు లాభాల్లో కొంత భాగం ఈ విధంగా గ్రామాల్లో ఖర్చుపెట్టడం అది విద్యాలయాలకు కేటాయించడం ఎంతో అభినందనీయం అని అడ్వాంట కంపెనీని ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి ఒక విశిష్ట అతిథి గా హాజరైన నారా శేషు వారి వంతుగా వారి (ఎన్ ఫౌండేషన్) ద్వారా పాఠశాలకు చెందిన క్రీడా సామాగ్రిని పాఠశాలకు ప్రకటించి వెనువెంటనే ఇవ్వడం జరిగింది. తమ పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడే సామాగ్రిని అందజేసిన,అడ్వాంట కంపెనీకి , కృష్ణ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత నారా శేషుకి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది,గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడ్వాంటా కంపెనీ ప్రతినిధులు,గ్రామ సర్పంచ్ మేక అప్పాయమ్మ,ఇళ్ల శ్రీనివాస్,స్కూల్‌సిబ్బంది,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## రీ సర్వే గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి అయిన గ్రామాల్లో రైతులకు నోటీసులు

**– అధికారులకు జేసి టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశం**



**భీమవరం,మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో రీ సర్వే, ఆర్ ఓ ఆర్, ఇనాం ఎస్టేట్, ల్యాండ్ గ్రౌండింగ్, వెబ్ ల్యాండ్ ఇష్యూ, తదితర అంశాల పురోగతిపై జిల్లాలోని రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసిల్దారులు, మండల సర్వేయర్లతో బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా లోని రీ సర్వే గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయిన 13 గ్రామాలలో రైతులకు 9-(2) నోటీసులను అందజేయాలని సంబంధిత శాఖ అధికారులును ఆదేశించారు. ఏ ఒక్క రైతుకు తన భూమికి సంబంధించి నోటీసులు అందలేదని ఫిర్యాదులు రాకూడదని అన్నారు. ఇంకా గ్రౌండ్ ట్రూతింగ్ పనులు జరుగుచున్న ఏడు గ్రామాలలోనూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆర్ఓఆర్,పిఓటి కేసులకు సంబంధించి ఇబ్బందులను తహాసిల్దారులు, డిప్యూటీ తహాసిల్దార్లు డేటాను ఆన్లైన్ చేయాలని అన్నారు. ఇళ్ల స్థలాలు పున పరిశీలనలో ఎంతమంది అర్హులు, అనర్హులను గుర్తించారో పూర్తిస్థాయి సమాచారమును రెండు రోజుల్లో అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, కలెక్టరేట్ ల్యాండ్ సూపరిడెంట్ సి హెచ్ రవికుమార్, డిటిలు ఎం.సన్యాసిరావు, జీవన రాణి, ఇడిఎమ్ ఎం.కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకర్లు లక్ష్యాలను పూర్తి చేయాలి

- రైతాంగానికి చేయూతనివ్వాలి
- కౌలు రైతులకు అండగా నిలవాలి
- ముద్ర రుణాలపై విస్తృత అవగాహన కల్పించాలి



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** వ్యవసాయ పరమైన ఏలూరుజిల్లాలోవ్యవసాయరంగానికి ఇతోధికంగా రుణ సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం త్రైమాసిక బ్యాంకర్ల సమావేశం జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రైతులకు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు విరివిగా రుణాలు అందించి వారి పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు. పంటసాగుచేస్తు సిసి ఆర్సీ కార్డులు కలిగిన కౌలు రైతులకు తప్పనిసరిగా రుణాలు అందించాలని సూచించారు. జిల్లాలో 23,314 మంది సిసి ఆర్సీ కార్డులు కలిగిన కౌలు రైతులకు ఇంతవరకు రూ.142.85 కోట్లు అందించారని, ఇదే సమయంలో సిసి ఆర్సీ కార్డులు కలిగిన ప్రతి కౌలు రైతుకు రుణ పరపతి కల్పించాలని స్పష్టంచేశారు. ప్రాధాన్యతా రంగాలకు సంబంధించి రూ.15,778 కోట్లకు గాను ఇంతవరకు 13,277 కోట్లు(84.15) శాతం రుణాలు అందించారని,నెలాకరుకి నూరుశాతం లక్ష్యాలను సాధించాలన్నారు. ఆర్థిక సంవత్సరంలో రూ. 90.63 కోట్లు విద్యారుణాలుగా, రూ.618.63 కోట్ల రూపాయలు హౌసింగ్ రుణాలుగా అందించారని వీటిని మరింత విస్తృతం చేయాలని బ్యాంకర్లకు కలెక్టర్ సూచించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ ముక్తి బిజిలీయోజన కింద అత్యధిక ప్రాధాన్యతనిచ్చి పూర్తిస్థాయిలో అమలుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లాలో ఇంతవరకు 1447 ధరఖాస్తులకు గాను ఇంతవరకు 715 మందికి రూఫ్ టాప్ సోలార్ యూనిట్లు మంజూరు చేశారని, మరో 305 పరిశీలనలో ఉన్నాయన్నారు. వివిధ కారణాలతో తిరస్కరించిన 415 ధరఖాస్తులను పునఃపరి శీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారుడు సొంతస్థలం చూపిస్తే కూడా మంజూరు చేయవచ్చనే నిబంధనను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు.

ముద్ర రుణాలపై విస్తృతంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పాల్గొన్న ఆర్బిఐ ఎల్ డిఓ పి.పూర్ణిమ మాట్లాడుతూ ఆర్బిఐ ప్రమాణాలకు అనుగుణంగా 2024-25 సంవత్సరానికి సంబంధించి మొత్తం రుణాల్లో వ్యవసాయానికి 18 శాతం,ప్రాధాన్యతా రంగాలకు 40 శాతం రుణాలు ఇవ్వవలసివుండగా జిల్లాలో ఈలక్ష్యాలకు మించి వ్యవసాయానికి 57.41 శాతం,ప్రాధాన్యతా రంగాలకు 72.07 శాతం రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశ ంలో ఆర్బిఐ ఎల్ డిఓ పి.పూర్ణిమ,యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎన్. శ్రీనివాస్,ఎల్ డిఎం డి.నీలాద్రి,నాబార్డ్ డిడిఎం అనీల్ కాంత్,పలువురు అధికారులు పాల్గొన్నారు.

# అడ్మిషన్ల కోసం ఆరాటం

- వీఆర్వోలు ప్రవేట్ పాధ్యాయుల ద్వారా తల్లిదండ్రులకు ఫోన్లు
- సీబీఎస్సీ,జేఈఈ ,నీట్ ,అంటూ విద్యార్థులతో చెలగాటం
- గుర్తింపు లేని పాఠశాలలపై స్పందించని విద్యా శాఖ




**ఏలూరు ఎడ్యుకేషన్,మేజర్‌న్యూస్ :** కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల కోసం పడుతున్న హైరానా అంతా ఇంత కాదు. ఇందులో ఏలూరు జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలు ముందు వరుసలో ఉన్నాయి. ఏలూరు నగరంలో ఒక పాఠశాలపై ప్రభుత్వ అనుమతులు తీసుకొని అదే అనుమతులతో రెండు మూడు బ్రాంచ్ లు నడుపుతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చాప కింద నీరులా విస్తరిస్తుంటే చోద్యం చూస్తున్నారు. తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లు సేకరించి తమ విద్యాసంస్థలో అడ్మిషన్ తీసుకుంటే అనేక ఫీజు రాయితులు కల్పిస్తామంటూ,ఆఫర్లు ఉన్నాయంటూ ఆశ చూపుతున్నారు. నిబంధనల ప్రకారం నూతన విద్య సంవత్సరం ప్రారంభానికి ముందు మాత్రమే వివిధ విద్య సంస్థల వారు విద్యార్థులను చేర్చుకోవాలి కానీ విద్యాశాఖ అధికారుల అండదండలతో వారికి ఇష్టం వచ్చిన విధంగా వ్యవహరిస్తున్నారు. కనీస ప్రభుత్వ అనుమతులు లేకుండా ఏలూరు నగరం పరిసర ప్రాంతాలలో అనేక ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యాశాఖ కార్యాలయంలో కింద స్థాయి అధికారి దగ్గర నుండి ఉన్నత అధికారి వరకు ఎటువంటి పత్రాలు లేకుండా ప్రభుత్వ అనుమతుల కోసం వచ్చే వారిని అనుమతించడం విచారకరం. విద్యార్థులకు ప్రాథమిక విద్యా సంవత్సరం నుండి సీబీఎస్సీ, నీట్ ,జేఈఈ అంటూ అనేక కోర్సులు నేర్పుతూ విద్యార్థుల పై ఒత్తిడి చేస్తూ తల్లిదండ్రుల దగ్గర అధిక మొత్తంలో ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. అసలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ తరగతి వారికి ఆ పాఠాలే చెప్పాలి గాని అనేక కోర్సుల పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేసి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు. ఇప్పటికైనా ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారులు నిద్రలేచి సరైన అనుమతులు లేని ప్రైవేట్ విద్యాసంస్థలపై, ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకునే విధంగా వ్యవహరిస్తారో లేదో అని విద్యార్థి సంఘులు మండిపడుతున్నాయి.

**ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.శివకుమార్**



ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.శివకుమార్ మాట్లా డుతూ ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజ మాన్యం వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యాస ంస్థలు నడుపుతూ పదోతరగతి పరీక్షలు అవ్వక ముందే ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారని మండి పడ్డారు. విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర అధిక ఫీజులు వసూలు చేయడమే యాజమాన్యం వారి లక్ష్యంటూ తల్లిదండ్రులు కూడా ఆలోచించి తమ పిల్లలను ప్రైవేట్ విద్యాసంస్థల్లో అడ్మిషన్ తీసుకునే ముందు ఆలోచించి ముందుకు వెళ్లాలని. ఎవరైనా ముందస్తు అడ్మిషన్ చేస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాస ంస్థలపై అధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ అనుమతులు లేని పాఠశాలలు మూసివేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు.

**పి,డి,ఎస్,యు ఏలూరు జిల్లా అధ్యక్షులు కాకినాని**



పి,డి,ఎస్,యు ఏలూరు జిల్లా అధ్యక్షులు కాకినాని మాట్లాడుతూ జిల్లాలో అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. సంవత్సర సంవత్సరానికి ఫీజులు పెంచి తల్లిదండ్రుల జేబులు గుల్ల చేస్తున్నటువంటి ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు తనిఖీలు ముమ్మరం చేయాలి.

విద్యా సంవత్సరం పూర్తి కాకుండానే పాఠశాల విద్యాశాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే 2025-2026 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ఓపెన్ అంటూ బహిరంగ ప్రకటనలు బ్యానర్లు వేస్తూ విద్యాశాఖ నిబంధనలు బేఖా త ర్ చేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి. ఏలూరులోని అనేక ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యం వారు ప్రాథమిక విద్య నుండే అనేక కోర్సుల పేరుతో విద్యార్థులను తీవ్ర ఒత్తిడి చేస్తూ వాళ్ల ప్రాణాలతో చెలగాటమాడు తున్నారని వివరించారు.

## సునీతా విలియమ్స్‌కు ఆర్టీసీ జోనల్ చైర్మన్ అప్పలనాయుడు అభినందనలు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** అంతరిక్ష రంగంలో సునీత విలియమ్స్ ప్రదర్శించిన ధైర్య సాహసాలు,ఆమె పరిశోధనలు ఈ ప్రపంచానికి ఎంతో ఆదర్శం. ఇద్దరు వ్యోమగాములు భూమిని సురక్షితంగా చేరుకోవడం ఆనందాయకం. స్త్రీ సంకల్పశక్తి,అంకితభావాన్నీ చూసి ప్రపంచమే గర్విస్తుంది అని కొనియాడిన ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్,ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడు తొమ్మిది నెలల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత అంతరిక్షం నుంచి భూమ్మీదకు చేరుకున్న భారత్ సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ లకు ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు శు భాభినందనలు తెలియజేశారు. ఇద్దరు వ్యోమగాములు భూమిని సురక్షితంగా చేరుకోవడం ఆనందాయకమని అన్నారు. ముఖ్యంగా భారత్ మూలాలు ఉన్న సునీత విలియమ్స్ సాధించిన ఈ విజయం మన దేశం అంతటికి గర్వకారణం అని పేర్కొన్నారు. భవిష్యత్తులో మానవ సహిత అంతరిక్ష యానానికి ఈ యాత్ర విజయం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఇద్దరు వ్యోమగాములు మరింత ఉన్నతమైన స్థాయి కు చేరుకోవాలని రెడ్డి అప్పల నాయుడు ఆకాంక్షించారు.

## జాబ్ మేళాలో 37 మందికి ఉద్యోగాలు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో డిఎల్‌టిసి ఐటిఐ కళాశాల ఏలూరు బుధవారం నిర్వహించిన జాబ్ మేళా 41మంది యువత హాజరయ్యారు. 37 మందికి వివిధ కొలువులకు ఎంపిక చేసినట్లు జిల్లా నైపుణ్యభివృది సంస్థ అధికారి ఎన్.జితేంద్ర బాబు తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో టి.వి.ఎస్ షోరూం, సి.ఎమ్.ఆర్, బజాజ్ క్యాపిటల్,అపోలో ఫార్మసీ కంపెనీల ప్రతి నిధులు పాల్గొనడం జరిగిందన్నారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేసారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సహాయ సంచాలకులు ఎస్.ఉగాది రవి,ఈ.ఓ.వి.జి వరలక్ష్మి, ప్రవీణ్ కృష్ణ ఎట్క,పి.కె.ప్రవీణ్,జిల్లా ప్లేస్మెంట్ అధికారి,కోఆర్డినేటర్ సునీల్ పాల్గొన్నారు.

## బదిలీపై వెళుతున్న ఆర్బిఐ ఎల్డిఓ పి.పూర్ణిమకు వీడ్కోలు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు జిల్లాలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్ డివో గా విధులు నిర్వర్తించి కర్ణాటకకు బదిలీపై వెళుతున్న పి.పూర్ణిమకు ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక గౌతమీ సమావేశ మందిరంలో బ్యాంకర్ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి,ఆర్బిఐ ఎల్ డివో పూర్ణిమను శాలువతో సత్కరించి మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో బ్యాంకర్లు,జిల్లా యంత్రాంగానికి సమన్వయంగా ఉంటూ గత రెండేళ్లుగా సమర్ధవంతంగా సేవలు అందించిన పి.పూర్ణిమను అభినందించారు. అదే విధంగా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో యూని యన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎన్. శ్రీనివాస్, ఎల్డిఎం డి.నీలాంద్రి పూర్ణిమను సత్కరించి జ్ఞాపికను అందజే శారు. కార్యక్రమంలో నాబార్డు డిడిఎం అనీల్ కాంత్,వివిధ శాఖల బ్యాంక్ కంట్రోలర్లు,కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.